# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 23 సెప్టెంబరు, 2026 | పేజీలు : 08


## పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం



**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ఆలయ పునర్నిర్మాణం,గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్ల పనులపై అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం కాళేశ్వరం క్షేత్రంలో పర్యటించిన రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తొలుత ఆది ముక్తీశ్వర స్వామి ఆలయం,బాలాలయాన్ని దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా ఆలయ ప్రాంగణంలో మంత్రి శ్రీధర్ బాబుకు దేవాదాయ కమీషనర్ హనుమంత రావు,ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆలయ చైర్మన్ మోహన్ శర్మ,ధార్మిక సలహాదారు గోవింద హరి,ఆలయ అర్చకులు,అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి,దేవాదాయ అధికారులతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వరంగల్‌కు కొత్త రూపు తీసుకొస్తాం

### హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నా !
### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాం రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. సోమవారం రాత్రి 11 గంటల వరకు వరంగల్ అభివృద్ధిపై సమగ్ర సమీక్ష నిర్వహించామని, ప్రతి పనికీ డెడ్‌లైన్ నిర్ణయించి ఎప్పటిలోగా పూర్తి చేయాలో స్పష్టమైన టైమ్‌లైన్ రూపొందించామని తెలిపారు.మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్‌రోడ్, ఆసుపత్రులు, ఫిల్టర్‌బెడ్, దేవాలయాల అభివృద్ధి తదితర కీలక ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. వచ్చే నెల దసరాలోపే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రానున్నారని, కాకతీయ యూనివర్సిటీ 50 ఏళ్ల వేడుకలు, ఆర్ట్స్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.జీవోలు ఇచ్చి వదిలేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, నిధులు విడుదల చేసి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తున్నామని నాయిని అన్నారు. మామునూరు విమానాశ్రయానికి గతంలో అవసరమైన అనుమతులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సుమారు రూ.300 కోట్లు విడుదల చేసి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లిందన్నారు. రాష్ట్రం తన బాధ్యతగా భూమిని సమకూర్చినందున విమానాశ్రయ నిర్మాణం, తదుపరి ప్రక్రియలో కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలన్నది ప్రజల అభిప్రాయాలతో నిర్ణయించుకోవచ్చని నాయిని అన్నారు. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలు అనవసరమని విమర్శించారు. గాంధీ కుటుంబంపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన నాయిని, దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబాన్ని విమర్శించే ముందు తమ చరిత్రను చూసుకోవాలని అన్నారు.వరంగల్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు నాయకులు రాజకీయ విమర్శలకు దిగుతున్నారని నాయిని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వరంగల్‌ను కీలక నగరంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మా సమాధానం మాటల్లో కాదు జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఉంటుంది అని నాయిని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస రావు, అనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, కమలాపూర్ మార్కెట్ చైర్మన్ రాణి మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు,శ్రీమాన్,విజయశ్రీ రజాలి,జక్కుల రవీందర్ యాదవ్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

### విబి–జి రాంజి పథకం కింద చేపట్టిన
## అభివృద్ధి పనులు వేగవంతం



**ప్రజాపక్షం/జనగామ:** వీబీ జీరాంజీ పథకం కింద ఇప్పటికే మంజూరై చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పనుల పురోగతిపై కలెక్టర్ సందీప్ కుమార్ఝా ఎమ్మెల్యే కడియంతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఇప్పటికే మంజూరైన పనులు, పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనుల వివరాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగం విషయంలో ఈ సారి వర్షపాతం తక్కువగా ఉన్నందున రాబోయే రోజులలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్దంగా ఉండాలని సూచించారు. రైతుల పంటలను కాపాడేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం, డ్రిప్ సమస్యలు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో పనిచేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కిరణ్ ప్రకాశ్, డీఆర్డీవో భాస్కర్, అధికారులు అంబికా సోని, సీతారాం, సంపత్ రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వినాయకుడు ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలి

### -మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట:** ఏ శుభకార్యం ప్రారంభించినా ముందుగా విఘ్నేశ్వరుడిని పూజించడం మన సంస్కృతి, సంప్రదాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. విఘ్నాలను తొలగించి కార్యసిద్ధిని ప్రసాదించే వినాయకుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.వినాయక నవరాత్రుల సందర్భంగా సిద్దిపేట పట్టణంలో 60 గణేష్ మండపాల లో కొలువైన విఘ్నేశ్వరున్ని దర్శించుకున్నారు కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడుతూ... యజ్ఞం, హోమం, వ్రతం, పూజతో పాటు ఏ శుభకార్యమైనా వినాయకుడిని పూజిస్తామన్నారు.. "దేవుడిని ఎంత ఆడంబరంగా పూజించామన్నది ముఖ్యం కాదు.. ఎంత భక్తి, శ్రద్ధతో పూజించామన్నదే ముఖ్యమని. బంగారంతో పూజ చేసినా భక్తి లేకపోతే ప్రయోజనం లేదన్నారు.. మట్టితో చేసిన వినాయకుడినైన మనస్ఫూర్తిగా పూజిస్తే భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయి" అని పేర్కొన్నారు. వినాయక ఉత్సవాల్లో మట్టి విగ్రహాలు, సహజ రంగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్, రసాయనాలు, హానికరమైన రంగుల వినియోగం వల్ల చెరువులు, నీటి వనరులు, భూగర్భ జలాలు కలుషితమై చివరకు ప్రజల ఆరోగ్యంపైనే ప్రభావం చూపుతాయని తెలిపారు."పర్యావరణాన్ని కాపాడుకోవడం అంటే మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవడం. మనం ప్రకృతిని ప్రేమిస్తే ప్రకృతి మనల్ని ప్రేమిస్తుందని చెప్పారు.. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యతని గుర్తు చేశారు... వినాయక ఉత్సవాలకు ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందించిన గొప్ప చరిత్ర ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వినాయక ఉత్సవాలను ప్రజలను ఏకం చేసే వేదికగా ఉపయోగించారని గుర్తుచేశారు."బాలగంగాధర్ తిలక్ వినాయక ఉత్సవాల ద్వారా ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. అదే స్ఫూర్తిని మనం కొనసాగించాలి. వినాయక మండపాలు విభేదాలకు వేదికలు కాకూడదు.. ప్రజల మధ్య ప్రేమ, అనుబంధం, సోదర భావం పెంచే వేదికలు కావాలి" అని పిలుపునిచ్చారు.ఒక్కొక్కరిగా చేసే కార్యక్రమం కంటే అందరూ కలిసి సమష్టిగా నిర్వహించే కార్యక్రమానికి ఎంతో గొప్పతనం ఉంటుందన్నారు. పిల్లలు, యువత, మహిళలు, భక్తులు అందరూ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగస్వాములై భక్తితో పాటు సామాజిక ఐక్యతను చాటాలని కోరారు."మనందరి మధ్య ప్రేమ, గౌరవం, అనుబంధం మరింత పెరగాలి. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని విగ్నేశ్వరుని ప్రార్థించారు.



## ఎస్‌సి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా: సర్పంచ్ బిల్ల యాదగిరి



**ప్రజాసక్షం/వేలేరు :** వేలేరు మండలకేంద్రంలోని ఎస్ కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణం చేయడం కోసం కృషిచేస్తానని గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి అన్నారు.మంగళవారం గ్రామంలోని పలు వినాయకుల వద్ద అర్చకులు చౌదరి సంతోష్,చౌదరి వీర సాయి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించగా ఎస్‌సీకాలనీలో గణపతి మైత్రీ యూత్ అసోషియేన్ ఆద్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా హాజరై అన్నప్రసాదం వడ్డించి మాట్లాడారు, కాలనీలో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వినాయక ఉత్సవాలను భక్తి శ్రద్దలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వినాయక ఉత్సవాల కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సమతుల్యమైన పోషకాహారం తీసుకోవాలని మన్‌పహాడ్ సర్పంచ్ పారుపల్లి బాలమ్మ అన్నారు. మంగళవారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మన్‌పహాడ్ గ్రామంలోని అంగన్వాడి సెంటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్పంచ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వడ్లకొండ సావిత్రి పాల్గొని మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడి సెంటర్లో అందించే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రశాంత్ ఆచార్య, వివో సంఘం అధ్యక్షురాలు కొమురమ్మ, అంగన్వాడి టీచర్స్, ఆశ వర్కర్స్, అంగన్వాడి ఆయాలు పాల్గొన్నారు.

## రూ.1600 కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** రూ.1600 కోట్ల అభివృద్ధి నిధులు ఎక్కడ వినియోగించారో ఎమ్మెల్యే కడియం శ్రీహరి శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపి మడల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్ గౌడ్ డిమాండ్ చేశారు. జాఫర్‌గడ్ మండలంలోని గ్రామాలలో రహదారులు, వైద్య సదుపాయాలు సరిగా లేవని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులతో చేపట్టిన అభభివృద్ధి పనులను కూడా కడియం శ్రీహరి గుర్తించాలన్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా అద్యక్షులు మలిపాష, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగారపు రమేష్, నాయకులు రవి, మదన్ మోహన్, యాదగిరి గౌడ్, గోపాల్, శ్రీనివాస్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## కొద్ది రోజుల్లో ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులో తేవాలి



**ప్రజాపక్షం/పరకాల:** పరకాల లోని వద్ద వంద పడకల ఆసుపత్రి సేవలను కొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ పరకాల పట్టణంలోని ఇటీవల ముఖ్యమంత్రి చే ప్రారంభించబడిన 100 పడకల ఆసుపత్రి భవనాన్ని సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. సుమారు రెండు గంటల పాటు సంబంధిత అధికారులతో పాటు ఆస్పత్రి భవనాన్ని పూర్తిగా కలియ తిరి గారు. ఆసుపత్రిలో ఉండబడిన పరికరాలు ఇంకా రావాల్సిన పరికరాల వివరాలను ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడికి వచ్చే రోగులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేవిధంగా పరికరాలను సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వ అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా చూడవలసిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ అధికారుల మీద ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆస్పత్రిలో ఇప్పటి వరకు పూర్తిగాని పనులు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేసే విధంగా జిల్లా కలెక్టర్ కాంట్రాక్టర్ను ఆదేశించారు. సివిల్ ఆసుపత్రి సూపర్డెంట్ తో పాటు ఇక్కడ పనిచేస్తున్న వైద్యులకు అందుకు అనుగుణమైన సూచనలు జిల్లా కలెక్టర్ అందించారు. వీలైనంత వేగంగా పనులను పూర్తి చేసి పరికరాలను సమకూర్చుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆసుపత్రిని సందర్శించి ఎప్పటికప్పుడు నివేదికలను అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ కమిషనర్ పవన్తో పాటు సంబంధిత అధికారులు పరకాల ఆర్డిఓ వెంకన్న తాసిల్దార్ విజయలక్ష్మి లు పాల్గొన్నారు.

## గ్రామాలలో పారదర్శకంగా భూముల రీసర్వే



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** జిల్లాలోని గ్రామాలలో చేపట్టిన భూముల రీ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం జయగిరి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో భూముల రీసర్వే పై అవగాహనకు భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు.ఈ సందర్భంగా భూములు కొలతల శాఖ అధికారులు, సర్వేయర్లు భూముల రీసర్వే కి సంబంధించిన అంశాలపై గ్రామసభలో రైతులు, స్థానికులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలకు తావులేకుండా భూముల రీ సర్వే జరుగుతుందన్నారు. భూముల రీ సర్వే చేపడుతుండగా గ్రామ రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సర్వేయర్లకు సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు ఉండాలని తెలియజేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్ కుమార్, గురుకుల పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## గుడికి,వాగుకు ఇబ్బందులు జరగవు



**ప్రజాపక్షం/నడికూడ :** నడికూడ మండల కేంద్రంలో కంఠాత్మకూర్ గ్రామంలో చాకిరేవు గుట్టపై జరుగుతున్న పరిణామాలపై గ్రానైట్ యజమానిదారుడు కుమారస్వామి ప్రెస్ క్లబ్ లో పత్రికా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ బరిగీల కుమారస్వామి,బరిగల రాధిక, మేము గ్రానైట్ కాంట్రాక్ట్ చేసుకుంటు,క్రీస్తు జ్యోతి పేరుమీద సుమారు 3 ఎకరాలలో కాంట్రాక్టు టెండర్ దారా పొందినామన్నారు. మేము టిప్పర్తో దారికి మొరం పోస్తుండగా,స్థానిక సర్పంచ్ కొంగంటి తిరుపతి అడ్డుపడి గ్రామస్తూలను ఉసిగొల్పి దీని ద్వారా చుట్టూ ప్రక్క రైతులకు ఇబ్బంది జరుగుతుందని బ్లాక్ మేలు చేస్తూ,నన్ను డబ్బులు ఇవ్వమని నానా బుతులు తిడుతూ,నన్ను10 లక్షల వరకు ఇవ్వమని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మా ద్వారా గ్రానైట్ వర్క్ ద్వారా చుట్టు ప్రక్క రైతులకు అక్కడ ఉన్న గుడికిగాని, ప్రక్కన ఉన్న వాగుకు గాని ఎలాంటి ఇబ్బందులు జరుగవు, మీరు మాకు సహకారం అందించి మాకు న్యాయంగా వచ్చిన కాంట్రాక్టు చేసుకొని సహకరించవలసిందిగా కోరుతున్నామని పత్రికా ముఖంగా తెలియజేస్తున్నానని అన్నారు.

## ఉపాధి కోల్పోయిన కూలీలకు పరిహారం ఇవ్వాలి



**ప్రజాపక్షం/కాజీపేట :** ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాంత వాసుల అనేక దశాబ్దాల పోరాట ఫలితంగా, రాష్ట్ర విభజన హామీల ఫలితంగా ప్రస్తుతం కాజీపేటలో ఏర్పాటు చేస్తున్న రైల్వే వ్యాగన్స్ తయారీ ఫ్యాక్టరీ కోసం అయోధ్య పురం గ్రామానికి చెందిన సుమారు 165 ఎకరాల వ్యవసాయ భూమిని ప్రభుత్వం సేకరించగా ఆ భూమిలో ప్రత్యక్షంగా కూలి పనులు చేస్తూ పరోక్షంగా జీవనోపాధి పొందుతూ వందల కుటుంబాలు తమ కుటుంబాల్ని గడుపుతూ వచ్చాయని, వారు ప్రస్తుతం ఆ భూముల్లో నుండి ఇన్ని రోజులు పొందిన ఉపాధిని పూర్తిగా కోల్పోయి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నందున వారికి తక్షణమే పునరావాస ప్యాకేజీలో భాగంగా పరిహారం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకటరాజం జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కూలీలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, విసికె జిల్లా అధ్యక్షులు కన్నాల రవి, సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు కొట్టపాక రవి లతో కలిసి చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో వెంకట్రాజం మాట్లాడుతూ భూ సేకరణ చట్టం 2017 ప్రకారం పునరావాస ప్యాకేజీ లో భాగంగా నెలకు 3500 చొప్పున 20 సంవత్సరాల పాటు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సేకరించిన వ్యవసాయ భూమిలో ఉపాధి కోల్పోయిన కూలీలకు పరిహారం చెల్లించాలని, జిల్లా అధికారులు ఈ చట్టాన్ని మరిచిపోయి నిరుపేద కూలీలకు అన్యాయం చేశారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఇలాసాగరం వీరయ్య, పూల విజయ, ఈగ నరసమ్మ, తిమ్మాపురం ఈశ్వరమ్మ, జారిపోతుల జయ, భారత, ఉప్పు సునీత, బొట్ల భాగ్య, ఇలాసాగరం రాధిక తదితరులతో పాటు కూలీలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ లో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం, గురువారం నిర్వహించనున్న వినాయక నిమజ్జనానికి గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టారు. సుమారు 60 పైగా వినాయక విగ్రహాల నిమజ్జనానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని గ్రామ సర్పంచ్ సతీష్ తెలిపారు. నిమజ్జనం ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు గ్రామ పంచాయతి సిబ్బంది పర్యవేక్షణ కొనసాగుతుందని, భక్తుల భద్రతకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని పేర్కొన్నారు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిమజ్జోత్సవాలు జరుపుకోవాలని ఏర్పాట్లను పరిశీలించి వారు తగు సూచనలు చేశారు. నిమజ్జన సమయంలో భక్తులు సమన్వయం పాటించాలని అన్నారు.

## మల్లికార్జున స్వామి దేవాలయంలో మహా అన్నదానం కార్యక్రమం



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** గణపతి నవరాత్రులలో భాగంగా ముల్కనూర్ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 550 మంది భక్తులు ఈ అన్నదాన తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముల్కనూర్ ఎస్సై రాజు హాజరై వినాయక పూజ నిర్వహించారు తదనంతరం అన్నదాన కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ జక్కుల మల్లికార్జున్ వైస్ చైర్మన్ గిరబోయిన కుమారస్వామి మాజీ చైర్మన్ జక్కుల ప్రకాశం మరియు భక్తులు యాదవ సంఘం కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## భక్తాంజనేయ స్వామి దేవాలయంలో అన్నదానం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ భక్తాంజనేయ స్వామి దేవాలయం నందు 25వ సంవత్సర గణపతి నవరాత్రి మహోత్సవాలు భాగంగా అన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. రాచమల్ల సునీత రాజిరెడ్డి వారి కుటుంబ సభ్యులు వారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,10వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ లీడర్ తోట పవన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. భక్తులు గణపతి నవరాత్రులను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. అదేవిధంగా నేడు నిమజ్జనానికి ఊరేగింపుగా బయలుదేరి గణపతి దేవుని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుకోవాలని చెప్పి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కనుకుంట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పోలు లక్ష్మణ్, కోశాధికారి కట్ల రఘు, గౌరవ అధ్యక్షులు తోట కనకరాములు, తోట ప్రకాష్, ఉపాధ్యక్షులు తోట శ్రీనివాస్, తోట కరుణాకర్, జక్కుల ప్రమోద్, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన ఏల సుందర్

ప్రజాపక్షం/దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన బొజ్జం పెద్ద యాకయ్య మంగళవారం ఉదయం మృతిచెందగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ వారికి ఇంటికి వెళ్లి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. వారి వెంట బీఆర్స్ మండల నాయకులు, యువజన నాయకులు, గ్రామస్థులు, తదితరులున్నారు.

## గణనాధునికి దీపారాధన



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంలో విశ్వసాయి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక గణపతి మండపం వద్ద మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని శోభాయమానంగా దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో లత, రమాదేవి, కళ్యాణి, వరలక్ష్మి, సుమలత, లలిత, సరిత, సంగీత, విజయ, సుజాత, మంజుల, రాజేశ్వరి, సరళ, పుష్ప, సంధ్య తదితర మహిళలు పాల్గొన్నారు.

## డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి



**ప్రజాపక్షం, కమలాపూర్:** మాదిగ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడు, మాదిగ హక్కుల దండోరా గౌరవ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత, పేదల డాక్టర్ గా పేరుగాంచిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాబోయే నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని విద్యావంతుల వేదిక (ఎంవివి) కన్వీనర్, ప్రజా సంఘాల జేఏసి చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఒకవేళ ఎమ్మెల్సీగా అవకాశం కుదరకుంటే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవిని అయినా ఇవ్వాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం డాక్టర్ రామకృష్ణ ఎంతో కృషి చేశారని, రామకృష్ణ హస్పటల్ ద్వారా నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత సంఘాల నాయకులు మోరే ఐలయ్య, పోలేపాక రాము పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు కమిటీలో ఉద్యోగుల ప్రతినిధులకు చోటివ్వాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం సంతోషకరమని టిఎస్‌సిపిఎస్ఈయూ చిట్యాల మండలాధ్యక్షుడు ఆరేపల్లి శరత్‌బాబు అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీలో సిపిఎస్ ఉద్యోగులు, నాయకులకు ప్రాతినిధ్య కల్పించాలని కోరారు. సిపిఎస్ ఉద్యోగుల అభిప్రాయాలు, సమస్యలు కమిటీ దృష్టికి వెళ్ళాలంటే వారి ప్రతినిధులకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లేకపోతే ఉద్యోగులకు సరైన న్యాయం జరగకపోవచ్చని పేర్కొన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నది రాష్ట్రంలోని ఉద్యోగుల్లో అధిక శాతం మంది ఆకాంక్ష అని తెలిపారు. అదేవిధంగా సిపిఎస్ పరిధిలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఉచితంగా హెల్త్ కార్డులు అందించాలని శరత్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు.

## ఉద్యమకారుల హక్కుల కోసం..చలో యాదగిరిగుట్ట



**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజినీకాంత్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, ఉమ్మడి వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గౌడగాని రాజీరు డిమాండ్ చేశారు. ఈ నెల 27న ఉదయం 11గంటలకు యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నెక్కొండ మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు కొత్త సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయరాదని వారు అన్నారు. హామీలను విస్మరిస్తే గత ప్రభుత్వానికి ఎదురైన రాజకీయ పరిస్థితులే కాంగ్రెస్‌కు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉద్యమకారుల సమస్యలు, హక్కులు, సంక్షేమ అంశాలపై యాదగిరిగుట్ట సభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు వంటల మల్లక్క, చాడ అనిత, చాడ సరితారెడ్డి, ఉమాదేవి, బొమ్మెర భాగ్యలక్ష్మి, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డోనాల రవి, జిల్లా కార్యదర్శి అల్లి యాదగిరి, మండల ఉపాధ్యక్షుడు మాదాసి యాకయ్య, పరకాల బిక్షపతి, కోరుకొండ యాకయ్య, ముడుచుకొమ్మల బానోతు నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

## మంగళసూత్రం..మన సంప్రదాయానికి ప్రతీక







**ప్రజాపక్షం/నెక్కొండ:** హిందూ వివాహ సంప్రదాయాలలో మంగళసూత్రానికి ప్రత్యేక స్థానం ఉందని పురోహితులు(డాక్టర్ వైజయంతి శ్రీరామశర్మ శివనగర్ రైల్వే మూడవ ప్లాట్వారం గణపతి ఆలయ ప్రధాన అర్చకులు) నెక్కొండ మండల ముదిగొండ సుబ్రమణ్య స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు పేర్కొంటున్నారు. భార్యాభర్తల దాంపత్య బంధం, సౌభాగ్యానికి ప్రతీకగా తరతరాలుగా మాంగల్యాన్ని గౌరవిస్తూ వస్తున్నారని సిద్ది బుద్ది సమేత విజయ గణపతి దేవాలయ వ్యవస్థాపక ప్రధాన అర్చకులు డాక్టర్ వైజయంతుల శ్రీరామ్‌శర్మ శివనగర్ రైల్వే మూడవ ప్లాట్‌ఫారం గణపతి ఆలయ ప్రధాన అర్చకులు, నెక్కొండ మండలం ముదిగొండ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రధాన అర్చకులు కో ట్ల కోటిలింగం, కోట్ల నవీన్ శాస్త్రీలు తెలిపారు. వివాహ సమయంలో పఠించే మాంగల్యం తంతువా నేనా...త్వం జీవ శరదాం శతం మంత్రంలో దంపతుల దీర్ఘాయుష్షు, దాంపత్య సౌఖ్యం, సౌభాగ్యాన్ని ఆకాంక్షించే భావన ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో మంగళసూత్రంతో ముత్యం, పగడాలను ధరించే ఆచారం కొనసాగుతోందని, వాటికి జ్యోతిషట్య సంప్రదాయంలో ప్రత్యేక ప్రీతకాత్మకత ఉందన్నారు. అయితే ముత్యం, పగడం ధరించడం వలన హార్మోన్ల సమతుల్యత, రుతుచక్రం, గర్భధారణ లేదా ప్రసవంపై ప్రత్యక్ష ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నిర్ధారించే ఆధునిక వైద్యశాస్త్ర ఆధారాలు లేవని స్పష్టం చేశారు. అందువలన ఇటువంటి అంశాలను విశ్వాసాలు, సంప్రదాయాలు పరిధిలోనే చూడాలని సూచించారు. ఆధునికతను స్వీకరిస్తూనే మన సంప్రదాయాల వెనుక ఉన్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక భావాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## మహా అన్నదానంలో పాల్గొన్న నవీన్, ప్రకాష్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్‌లోని శ్రీకృష్ణకాలనీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్‌లు హాజరై అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వరసిద్ది వినాయక నవరాత్రుల్లో భాగంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నే శ్రీకృష్ణ కాలనీ కమిటీ అభినందనలు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు మరింత అభివృద్ధి చెందాలని ఆ విగ్నేశ్వరుని కోరుకున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, బ్రిజు గోపాల్, అనంతుల శ్రీనివాస్, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్, మాజీ భద్రకాళి ట్రస్టు బోర్డు సభ్యులు జారతి వెంకటేశ్వర్లు, తోగరు క్రాంతి, కాంగ్రెస్ నాయకులు కాసర్ల రాజు, కర్రె వెంకన్న, సిలువేరు సాంబయ్య, జన్ను శ్యాంసుందర్, దౌడు నాగరాజ్, శ్రీ కృష్ణ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ సంఘం మండల కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్ర గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు.




అధ్యక్షునిగా డా. కందికట్ల వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్, డీసీలుగా పి రమేష్, కె అనిత ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ గెజిటెడ్ హెడ్ మాస్టర్ల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పి శోభారాణి, నర్సయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌యుబి గోడల తొలగింపుపై హర్షం

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) వద్ద ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న గోడలను తొలగించి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సౌకర్యాలు, పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యం ఇస్తూ చర్యలు చేపడుతున్న నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డికి రైల్వే అండర్ బ్రిడ్జి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌యూబీ పరిసరాలు సుందరంగా మారి ప్రజలకు మరింత సౌకర్యవంతంగా మారుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ పిఏసిఎస్ చైర్మన్ చల్లా శ్రీపాల్‌రెడ్డి, రావుల మధుకర్‌రెడ్డి, రాపాక శ్రీనివాస్, నంగునూరు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలిప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి అన్నారు. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంతో పాటు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నివారణలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం ఎంబిబిఎస్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, కళాశాల సిబ్బందితో డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ నారాయణ, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ పూనం, మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి, హెచ్ఈ విజిల్ కుమార్, ఎంఎస్ డబ్ల్యూ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల్లో అలసత్వం చేయకూడదు



అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో వచ్చే ఏడాది జరుగనున్న గోదావరి పుష్కరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదించిన అష్ట తీర్థాల అభివృద్ధి,భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు అవసరమైన రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రెవెన్యూఅదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు.కాళేశ్వరం క్షేత్రంలో మంగళవారం పర్యటించిన ఆయన క్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.అంతర్ రాష్ట్ర వంతెన నుండి ప్రధాన ఘాట్ వరకు సుమారు రెండు కిలోమీటర్లు,సరస్వతి ఘాట్ నుండి పక్షి తీర్థం వరకు 0.8 కి.మీటర్ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఐదు తీర్థాల ప్రతిపాదిత స్థలాలను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు.ఆయా ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన మౌలిక వసతులు.రహదారి సౌకర్యాలపై అధికారులతో చర్చించారు.అనంతరం ఆయన గోదావరి నది వద్ద వినాయక నిమజ్జన ప్రాంతాన్ని సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేసారు.

## వినాయక మంటపాల వద్ద మహా అన్నదానం



**ప్రజాపక్షం/నర్సింహులపేట:** మండల కేంద్రంలోని చౌరస్తా,గాంధీ బజారు,పొట్టిశ్రీరాములు వినాయక మండపాల వద్ద మంగళవారం మహా అన్నదాన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.గణనాథుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు నిర్వహకులు అన్నప్రాసాదాలను వడ్డించారు.పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా మండపాల పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి.వినాయక ఉత్సవాలను శాంతియుతంగా ,భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.కార్యక్రమంలో తాహాశీల్దారు రమేష్ బాబు,సర్పంచ్ పెదమాముల యాకయ్య,ఉపసర్పంచ్ కాస యాకయ్య,కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుల జినుకల రమేష్,కమిటీ అధ్యక్షలు కల్లెడ అభినయ్,ఉపాధ్యాక్షులు చౌదరపు విక్రం,రమేష్,దయాకర్,నయీమ్‌పాషా పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పనులు వచ్చే ఏప్రిల్ వరకు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:** కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం,అభివద్ధి పనులతో పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేసి వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలోని దేవస్థానం కార్యాలయంలో మంగళవారం అధికారులతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సంధర్భంగా మంత్రి మాట్లాడుతూ..క్షేత్రంలో ఆలయ పునర్నిర్మాణం ,అభివద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.200కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు.ఇప్పటికే ప్రారంభమైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అభివద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని.ఎక్కడా కూడా రాజి పడరాదని తేల్చి చెప్పారు.దేవుడి నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1000 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని మంత్రి తెలిపారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని పుష్కరాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.అభివృద్ధి పనులకు అవసరమైన మట్టి సేకరణతో పాటు ఇతర అనుమతుల ప్రక్రియను అటవీ శాఖ అధికారుల సమన్వయంతో వేగవంతం చేయాలని తెలిపారు.పనుల ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంజనీరింగ్ అధికారులు కాళేశ్వరంలోనే ఉంటూ పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పనుల పురోగతిని కాటారం సబ్ కలెక్టర్ ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన సమన్వయం చేయాలని సూచించారు.అధికారులు,కాంట్రాక్టర్లు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి కాళేశ్వరం క్షేత్ర ప్రాశస్త్యాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఈ సంధర్భంగా పేర్కొన్నారు.అంతకు ముందు ఆలయ పునర్నిర్మాణం పనులను మంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ కమీషనర్ హనుమంత రావు,జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ధార్మిక సలహాదారు గోవింద హరి,అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్. కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ,అశోక్ కుమార్,విజయలక్ష్మి ,గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు,ఆలయ చైర్మన్ మోహన్ శర్మ,ఆలయ ఈఓ మహేష్.స్థానిక సర్పంచ్ మోహన్ రెడ్డి,వివిధ శాఖల జిల్లా,మండల స్థాయి అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల కోసం ప్రత్యేక ఒపి కౌంటర్ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/నర్సంపేట:** వయోవృద్ధుల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్ ఏర్పాటుచేయాలని సీనియర్ సిటిజన్ ఫోరం గౌరవాధ్యక్షులు కోదాటి వీరస్వామి, అధ్యక్షులు నల్లా మనోహర్‌రెడ్డిలు కోరారు. నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణికి, సూపరింటెండెంట్ దామోదరిబాయికి వినతిపత్రాలను అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చే వృద్దులు ఎక్కువ సేపు క్యూలో నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేయాలన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వడ్లకొండ సాంబయ్య, మేర్గు లక్ష్మణ్‌బాబు, రామగోని సుధాకర్, పూర్ణచందర్‌రావు, పోలీస్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## గణనాథునికి అభిషేకాలు

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల కేంద్రమైన జఫర్‌గడ్ ఆర్యవైశ్య సంఘం హాలులో ప్రతిష్ఠించిన వినాయకునికి ఆర్యవైశ్యులు నవరాత్రి ఉత్సవాలను ప్రతిరోజు తీరొక్క పూజా కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. మహిళలు సామూహికంగా కుంకుమ పూజ, లలిత సహస్ర నారాయణం, భగవద్గీత పారాయణం, భజన కార్యక్రమాలను ప్రతిరోజు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి భద్రకాళి మాత ఆలయ సీనియర్ పూజారి సీతారామయ్య ఆధ్వర్యంలో పంచామృతాలతో వినాయకునికి అభిషేక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించినట్లు యుగంధర్, సోమన్న, ఇమ్మడి అశోక్ తెలిపారు.

### క్రీడా కార్యక్రమాల నిర్వహణ

ఐకమత్యాన్ని పెంపొందించే క్రీడా కార్యక్రమాలను ప్రతి రోజు పూజా కార్యక్రమాల అనంతరం చిన్నారులకు పలు రకాల క్రీడా కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాలలో గందె సోమన్న, దాంశెట్టి సోమన్న, సుధీర్, బోనగిరి శ్రవణ్, మురళి, నాగరాజు, హరిశంకర్, మణికాంత్, రమేష్, అనిల్, శ్రీను, రమేష్, రాజు, కమల , శ్రావ్య, ఉమ, అనిత, స్వాతి, మాధవి, దివ్య, గీత, రేవతి, శ్వేత, అనూష, సమత, భాగ్య, పాల్గొన్నారు.

## అత్యాధునిక రోబోటిక్ సర్జరీతో వేగవంతమైన రికవరీ




**ప్రజాపక్షం /హనుమకొండ టౌన్ :** వరంగల్ ప్రాంత ప్రజలకు అధునాతన యూరాలజీ చికిత్సలు, అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్స సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ (సోమాజిగూడ) కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ యూరోఆంకాలజిస్ట్ డాక్టర్ కౌశిక్ అమంచర్ల తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ, ప్రోస్టేట్, మూత్రాశయం, మూత్రనాళాల సమస్యలు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు హైదరాబాద్ దాకా వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నిపుణులైన వైద్యుల సలహాలు, ముందస్తు పరీక్షలు, ఫాలోఅప్ సేవలు అందించడమే ఈ ప్రత్యేక కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన వెల్లడించారు. యూరాలజికల్ క్యాన్సర్ల చికిత్సలో రోబోటిక్ సర్జరీ ఒక విప్లవాత్మక మార్పు అని డాక్టర్ కౌశిక్ తెలిపారు.కిడ్నీ క్యాన్సర్ రోబోటిక్ పార్టియల్ నెఫ్రెక్టమీ ద్వారా క్యాన్సర్ కణాలను మాత్రమే తొలగించి, ఆరోగ్యకరమైన కిడ్నీ భాగాన్ని కాపాడవచ్చునని, అయితే యశోద హాస్పిటల్స్‌లో 81 ఏళ్లు, 71 ఏళ్ల వయస్సు గల జీవించి ఉన్న వృద్ధ దాతల నుంచి కూడా సేకరించి విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. సరైన ప్రీఆపరేటివ్ పరీక్షలు, అనుభవజ్ఞులైన మల్టీ డిసిప్లినరీ వైద్య బృందం సమన్వయంతో ఇది సాధ్యమైందని చెప్పారు.ఈ విలేకరుల సమావేశంలో సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ కార్పొరేట్ రిలేషన్స్ విభాగ ప్రతినిధులు అసిస్టెంట్ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జిడబ్ల్యూఎంసి) పరిధిలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బల్దియా కమిషనర్ టి వెంకన్న తెలిపారు. సుమారు 8వేల విగ్రహాల నిమజ్జనానికి 19 ప్రధాన చెరువులతో పాటు చిన్న చెరువుల వద్ద కూడా అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హన్మకొండలోని బంధం చెరువు, సిద్దేశ్వర గుండం, భీమారం చెరువు, హసన్‌పర్తి పెద్ద చెరువు, కాజీపేట పరిగికుంటలతో పాటు వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి, ఉర్సుగుట్ట, రంగసముద్రం, రంగశాయిపేట, మామునూరు బేస్తం చెరువు, గీసుకొండ కట్టమల్లన్న చెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. విగ్రహాలు సురక్షితంగా చేరుకునేలా ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చడం, చెట్ల కొమ్మల తొలగింపు, బుష్ కటింగ్, పారిశుధ్య పనులు, చెరువుల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులు పూర్తిచేసినట్లు చెప్పారు. భారీ విగ్రహాల కోసం 30 క్రేన్లు, భద్రత కోసం 145 మంది గజ ఈతగాళ్లు 500 మంది బల్దియా సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు, తెప్పలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణకు ఎస్ఈ రాజ్‌కుమార్ ఓవరాల్ ఇన్‌చార్జిగా, ఈఈలు సంతోష్‌బాబు, రవికుమార్‌లకు వరంగల్, హన్మకొండ ప్రాంతాల బాధ్యతలు అప్పగించినట్లు కమిషనర్ తెలిపారు. ప్రతి నిమజ్జన కేంద్రంతో డిఈ, ఏఈలు, సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుద్దీకరణ, రాకపోకలు, బారికేడింగ్, భద్రత తదితర ఏర్పాట్లను పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, మైనింగ్, మత్స్య, ఇరిగేషన్ శాఖలతో సమన్వయంతో చేపట్టినట్లు వెంకన్న తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలని కోరారు.

## వినాయక సేవలో యువత...అన్నదానంతో భక్తి పరిమళం



**ప్రజాపక్షం/నెక్కొండ:** వినాయుడికి పూజలు చేయడమే కాదు..ఆయన సన్నిధికి వచ్చిన వారికి అన్నం పెట్టడంలోనూ భక్తిని చాటుకుంటున్నారు నెక్కొండ యువత. గత 37 ఏళ్లుగా తహసీల్దారు సెంటర్‌లో వినాయక మండపాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్న యువత యూత్, ఈ ఏడాది కూడా భక్తి శ్రద్దలతో అన్నదానం నిర్వహించింది. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారికి అన్నదానం చేశారు. వినాయకుడికి పెట్టే నైవేద్యం కంటే..ఆయనను దర్శించేందుకు వచ్చిన ఆకలితో ఉన్న భక్తుడికి పెట్టే అన్నమే గొప్ప ప్రసాదం అన్న భావనతో నిర్వాహకులు చేపట్టిన సేవాభావం పలువురి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి యువత యూత్ నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడుతూ మంగళవారం నెక్కొండ సంతకు దాదాపుగా 100 గ్రామాల ప్రజలు వస్తుంటారు. వారందరికీ అన్నదానం చేయడం అభినందించదగ్గ విషయని మంది కోసం మంగళవారమే అన్నదానం పెట్టే విధానం చాలా గొప్పదని ఆయన యువత యూత్‌ను అభినందించారు. భక్తిని పూజలకే పరిమితం చేయకుండా సేవగా మలచిన యువతే సమాజానికి ఆదర్శమని, 37 ఏళ్లుగా ఉత్సవాల సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అన్నదానానికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. భక్తి..సేవ,..ఐక్యత కలిసినప్పుడే పండగకు అసలైన పరమార్థం చేకూరుతుందని నిర్వాహకులు చాటి చెప్పారు.

## సామూహిక రుద్ర హోమం



**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సామూహిక రుద్ర హోమాన్ని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కూచన రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 150 మందికి పైగా జంటలు పాల్గొన్న ఈ కార్యక్రమం అయినవోలు కృష్ణమూర్తి ఎంతో హార్భాటంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కూచన రవీందర్ మాట్లాడుతూ పర్యావరణహితమైన వినాయక ఉత్సవాలు పద్మశాలి సంఘం లక్ష్యమన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పద్మశాలి జంటలసి సామూహిక శ్రీ లక్ష్మీ గణపతి రుద్ర హోమం నిర్వహించినట్లు తెలిపారు. పట్టణ పద్మశాలి సంఘంలో ప్రతి ఏట మట్టి గణనాధుని ప్రతిష్టిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఒకే అరటి ఆకులో దంపతులకు బోజనలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపాలిటి చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, మాజీ అధ్యక్షులు రుద్ర ఓంప్రకాశ్, ప్రధాన కార్యదర్శి పెండెం భాస్కర్ , కోశాధికారి గాజుల రాము , శ్రీరాముల శంకరయ్య, ఉపాధ్యాక్షులు తుమ్మ ఏకాంబరం, పెండెం వెంకటేశ్వర్లు, బాల్నే జగన్, కోదాటి గోపాలకృష్ణ, శ్రీరాముల కోటేశ్వర్,పెండెం శివానంద్, రచ్చ శ్రీనివాస్, బాల్నే బాల్ లింగం, వెంగళ బిక్షపతి, పెండెం రాజు, సామల రాజు, పెండెం బిక్షపతి, వెంగళ సదానందం, బింగి ఉపేందర్, దుస్స రాము, మార్తా అశోక్, బండారి శ్రీనివాస్, కందగట్ల రాజేందర్, సిరిమల్లె నరేందర్, జడల శ్రీనివాస్, సబ్బని రాజు, మార్త సాంబయ్య, శ్రీరాములపోశెట్టి, గణపురం సురేష్ తో పాటు కుల బాంధవులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలువండి




**ప్రజాపక్షం/వేలేరు:** ఆపదసమయంలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని మల్లికుదుర్ల గ్రామసర్పంచ్ జక్కుల మౌనిక సంపత్‌యాదవ్ అన్నారు.మంగళవారం వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ఏకదంత గజానన మండలి ఆధ్వర్యంలో యువనేతాజి ఫౌండేషన్ వరంగల్ సహకారంతో వినాయక చవితి సంధర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకోసం రక్తదాన శిభిరాన్ని గ్రామసర్పంచ్ జక్కుల మౌనొక సంపత్‌యాదవ్ ప్రారంబించి మాట్లాడారు,ఈసంధర్భంగా రక్తదాతలకు నిర్వాహకులు సర్టిఫెకెట్లు అందజేశారుకార్యక్రమంలో సర్పంచ్ మౌనిక సంపత్ యాదవ్,అనీల్‌కుమార్,యువనేతాజి ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్,బ్లడ్‌డోనర్ అండ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు,తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ కు గడువు సెప్టెంబర్ 30 వరకు

### వ్యవసాయ విస్తరణ అధికారి మహిపవన్ వెల్లడి

**ప్రజాపక్షం/వెంకటపూర్ :** నల్లగుంట క్లస్టర్ పరిధిలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను సెప్టెంబర్ 30 వరకు తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్. మహి పవన్ తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని పక్షంలో ఎరువుల బుకింగ్, సాయిల్ హెల్త్ కార్డులు, పి.ఎం. కిసాన్, రైతు భరోసా, పంట అమ్మకాలు తదితర వ్యవసాయ శాఖ పథకాల లబ్ధి పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.రైతులు తమ ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నంబర్, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డుతో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారిని గానీ, సమీపంలోని మీసేవ, సీఎస్సీ కేంద్రాలను గానీ సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## గణేశుడి వద్ద అన్నదానం



**ప్రజాపక్షం/ రేగోడు:** రేగోడు హనుమాన్ ఆలయ మధ్య ఏర్పాటు చేసిన వినాయ కుడు రేగోడు గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి మంగళ వారం రాజరాజేశ్వర ఆలయం వద్ద ఏర్పా టుచేసిన గణేష్ మండపంలో కమ్మరి బ్రదర్స్ నర్సింలు రమేష్ వీరేశం ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు ప్రత్యేక పూజలు చేశారు హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడి పైన పూరి జగన్నాథ్ కుడిపక్క హనుమాన్ ఎడమ పక్క గరుడ పక్షి తో ఏర్పాటు చేయ డంతో ఎంతో ఆకర్షవంతంగా ఉంది ప్రజలు అంటూన్నారు

## పార్వతి పుత్ర .. నమోస్తుతే



**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల కేంద్ర మైన పాపన్నపేటలో శ్రీ దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి ఉత్స వాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రత్యే కంగా తీర్చిదిద్దిన మండపంలో కొలువు దీరిన గణపయ్యకు అర్చకులు విశేష పూజలు చేశారు. మంగళవారం దాత వెంకటలక్ష్మీ దుర్గాగౌడ్ ఆధ్వర్యంలో అన్న దాన కార్యక్రమాన్ని చేపట్టారు. యూత్ సభ్యులు, వంశీ, నరేష్, లడ్డు, అభిషేక్, అభిలాష్, సంతోష్, నిఖిల్, సాగర్, తరుణ్ తదితరులు ఉన్నారు.

## ఏడుపాయల హుండీ ఆదాయం.49.26 లక్షలు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షే త్రమైన శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని ఆలయ హుండీ ఆదాయం 49.లక్షల 26 వేల 228 రూపాయల ఆదాయం వచ్చి నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి మతం వీరేశం, హుండీ పర్యవేక్షకులు విజయలక్ష్మి వెల్లడించారు. మంగళ వారం గోకుల్ షెడ్ లో హుండీ లెక్కింపు నిర్వహించగా పాపన్నపేట్ పోలీస్ సిబ్బంది, మెదక్ ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరి గింది. 80 రోజులకు గాను హుండీ ఆదాయం 49 లక్షల 26 వేల 228 రూపాయలు ఆదాయం వచ్చింది. మిశ్రమ బంగారం 000.080.000 గ్రాముల, మిశ్రమ వెండి 000.768.000 గ్రాముల వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్, ఆలయ, సిబ్బంది శ్రీ వెంకట అన్నమాచార్య సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జగ్గారెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** టీపీసీసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారె డ్డిని నూతన డిసిసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి సంగారెడ్డిలోని రామ్‌నగర్ మందిర్ లోమర్యాదపూర్వకంగా కలిసారు. చంద్రశేఖర్‌రెడ్డిని టీపీ సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభి నందించారు.. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ నిర్మలా జగ్గారెడ్డి ,డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరా లకు పైగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఆమె హయంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమా లను నిర్వహించామో అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తా మని చెప్పారు. చంద్రశేఖర్‌రెడ్డి తన పూర్తి సహాయ సహకా రాలు అందిస్తానని తెలిపారు. సోనియా గాంధీ ,రాహుల్ గాంధీ ,మల్లిఖార్జున ఖర్గే, పిసిసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

**సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు చంద్రశేఖర్‌రెడ్డి**

నూతన డిసిసి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనను డిసిసీ అధ్యక్షుడు ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇన్‌చార్జీ మంత్రి వివేక్ వెంకటస్వామి ,టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మల జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ఆమె మాదిరిగాను అందరితో సమన్వయం చేసు కుంటూ పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు.

# అసంపూర్తిగా రోడ్డు విస్తరణ పనులు



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండల పరిధిలోని కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక ప్రాంతాల రహదారిపై చేపట్టిన వెడల్పు పనులు తీవ్ర ఆల స్యమవుతుండటంతో స్థానికులు,ప్రయాణికులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ కోసం తవ్విన గుంతలను అలాగే వదిలేయడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడుగడుగునా ప్రమాదకర గుంతలు, ఈ ప్రాంతంలో పరి శ్రమలు పెరగడంతో రోడ్డుపై లారీలు, కంటైనర్లు వంటి భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. రహదారిని వెడల్పు చేస్తే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని స్థానికులు ఆశించారు. కానీ, పనులు ప్రారంభించి గుంతలు తవ్విన కాంట్రాక్టర్లు వాటిని పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలే శారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే క్రమంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమా దాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ గుంతలు సరిగా కనిపించకపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదక రంగా మారుతోంది.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

ప్రధాన రహదారిపై జరుగుతున్న పనులపై సంబంధిత అధి కారులు నిరంతరం పర్యవేక్షణ చేయకపోవడం వల్లే కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరో పిస్తున్నారు.నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో కనీసం హెచ్చరిక బోర్డులు,రాత్రి వేళల్లో వెలుగులు చిందే సూచికలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. వెంటనే చర్యలు తీసు కోవాలి ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి,నిర్దే శిత గడువులోగా రోడ్డు విస్తరణ పనులను నాణ్యతతో పూర్తి చేయించాలని కోరుతున్నారు.

# 271 సర్వే నంబర్‌లో భూమి హద్దుల కోసం సర్వే



**ప్రజాపక్షం/ కొండపాక :** కొండపాక మండ లంలోని వెలికట్ట విశ్వనాథపల్లి శివారులోని 271 సర్వే నంబర్‌లో భూ హద్దుల నమోదు ప్రక్రియ రెండవ రోజు మంగళవారం కొన సాగింది. 327 ఎకరాల 9 గుంటల పూర్తి విస్తీర్ణానికి సంబంధించిన హద్దులను అధికా రులు నమోదు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సుమారు 16 మంది సిబ్బం దితో 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తు న్నట్లు జిల్లా హెడ్‌క్వార్టర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వంశీ తెలి పారు. ఒక్కో బృందంలో జీపీఓ, మండల సర్వేయర్, లైసె న్స్‌డ్ సర్వేయర్, అసిస్టెంట్ చొప్పున నలుగురు పనిచేస్తు న్నారని వివరించారు. సర్వేలో భాగంగా 271 సర్వే నంబర్‌కు సంబంధించిన భూమి హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీ లించి నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో అధికారుల బృందాలు సర్వే ప్రక్రియను కొనసాగిస్తున్నాయన్నారు. మంగళవారం విశ్వనాథపల్లి రవీంద్ర నగర్ జప్తి నాచారం శివారు సుజల స్రవంతి మిషన్ భగీరథ ప్రాంతా లను రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. సర్వే పూర్తి అయిన తర్వాత హద్దులను ఏర్పరిచే నివేదికను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నారు.

# వెంకటేశ్వర స్వామి వెండి ఆభరణాలు అపహరణ



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండల పరిధిలోని కళ్ళకల్ గ్రామంలో తీవ్ర కలకలం రేగింది.గ్రామం లోని శ్రీ బంగారమ్మ దేవాలయ ప్రాంగ ణంలో వెలిసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్వామివారికి చెందిన అత్యంత విలువైన వెండి ఆభరణాలను అప హరించుకెళ్లిన ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.

**ఘటన వివరాల్లోకి వెళ్తే**

ఈ నెల 18వ తేదీ (శుక్రవారం) రాత్రి పూజలు ముగించుకుని ఆలయ పూజారులు తలుపులు మూసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి సమయంలో అజ్ఞాత వ్యక్తులు ఆలయంలోకి అక్రమంగా ప్రవేశించి దొంగతనా నికి ఒడిగట్టారు. శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహానికు అలంకరించిన వెండి కిరీటం, వెండి పాదాలు మరియు వెండి చేతులను దుండగులు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం నిత్యపూజల కోసం ఆలయ అర్చకులు వేణుగో పాల్ వచ్చి చూడగా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. స్వామి వారి ఆభరణాలు గాయబ్ కావడంతో ఆయన వెంటనే గ్రామస్థులకు, పోలీసు లకు సమాచారం అందించారు. ఆలయ అర్చకుడు వేణుగోపాల్ మంగళవారం ఇచ్చిన ఆధారాలు,రాతపూర్వక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్,పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. ఆలయ పరి సర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలి స్తున్నారు. చోరీకి పాల్పడిన నిందితులను త్వరలోనే గుర్తించి,వారిని బంధించి స్వామివారి వెండి ఆభరణాలను రికవరీ చేస్తామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి చోరీ జరగడంతో కళ్ళకల్ గ్రామస్థులు,భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత మందుల వినియోగంపై అవగాహన



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (VIPER) ఆధ్వ ర్యంలో ఉన్నత్ భారత్ అభియాన్ (యూబిఏ) కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుప త్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో రోగులు, వారి సహాయకులకు సురక్షితమైన మందుల వినియోగం, వైద్యుల సూచన మేరకే మందులు తీసుకోవడం, చికి త్సను క్రమం తప్పకుండా కొనసాగించడం, సొంతంగా మందులు వాడకుండా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మందుల వినియోగంలో ఏవైనా అనుమానాలు లేదా దుష్ప్రభావాలు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించా లని, ఆరోగ్య పరిరక్షణలో రోగుల భాగస్వామ్యం, బాధ్యతా యుత మందుల వినియోగం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైపర్ కళాశాల అధ్యాపకులు చందన, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## జెడ్పీహెచ్‌ఎస్‌లో పోషకాహారం, రుతుక్రమ ఆరోగ్యంపై అవగాహన



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకే షన్ అండ్ రీసెర్చ్ (VIPER) ఆధ్వర్యంలో ఉన్నత్ భారత్ అభియాన్ (యూబిఏ ) కార్యక్ర మంలో భాగంగా సెప్టెం బర్ 22న అవంచ జెడ్పీహె చ్ఎస్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థినులకు సమతుల్య ఆహారం, పోషకాహారం, రుతు క్రమ ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించడం, ఐరన్ అధి కంగా ఉన్న ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, ఆరో గ్యకర జీవనశైలి పాటించడం వంటి అంశాలను వివరించారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ట్రేడ్ లైసెన్స్, ఇంటి పన్నులు, డబుల్ బెడ్రూం పట్టా సర్టిఫికెట్ల జారీ విషయంలో కొందరు వ్యక్తులు ఫోన్ చేసి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించా లని అడుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మున్సి పాలిటీ కార్యాలయం నుంచి ఆన్‌లైన్ చెల్లింపుల కోసం తాము ఎవరికీ ఫోన్ కాల్ చేయమని స్పష్టం చేశారు. ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు చెల్లించమని అడిగితే చెల్లించి మోసపోవద్దని కోరారు. వివరాల కోసం నేరుగా పురపాలక సంఘం కార్యాలయంలో సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ కోరారు.

## ముదిరాజ్ సంఘం అధ్యక్షునిగా నిరుడి దుర్గయ్య



**ప్రజాపక్షం/పాపన్నపేట:** మల్లంపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షునిగా నిరుడి దుర్గయ్యను మల్లం పేట ముదిరాజ్ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షు డిగా బోయిన రమేష్, బూడిమే వినయ్, ప్రధాన కార్యదర్శిగా కోరబోయిన రమేష్, కార్యదర్శిగా చిరుమల బాలరాజ్, కోశాధికా రిగా చింతకుంట చంద్రయ్య, పుట్టి పాపయ్య, బూడిమే రమేష్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు సత్యనారా యణ, పుట్టి రమేష్, కొరబోయినా నర్సింలు, బూడిమే గంగారాం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ప్లాన్‌ను పర్యవేక్షించిన జిల్లా ప్రత్యేక అధికారి



ప్రజాపక్షం/నిజాంపేట్: రాంపూర్ గ్రామం లో వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ తయారీ నీ పర్యవేక్షించుటకు ముఖ్యఅతిథిగా జిల్లా ప్రత్యేక అధికారి పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ విజయ రావు హాజరయ్యారు. ఆయన తోపాటు డి ఆర్ డీ ఏ శ్రీనివాస్ రావు విచ్చేసి పిఆర్‌పి ద్వారా ప్రజల భాగస్వామ్యం గ్రామానికి అవసరమయిన నాలుగు రకాల కేటగిరీ లకు సంబంధించి ఈ సంవత్సరం రాబోయే సంవత్సరం పనులను గుర్తించుకొని ప్రణాళికను తయారు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాజిరెడ్డి, ఎంపీఓ రజినీకాంత్ రెడ్డి, ఏపీఓ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ పొన్నబోయిన ప్రవీణ్, వార్డు సభ్యులు శిరీష, రూపిత , మహరూన్, సతీష్, సయ్యద్, రాములు, పంచాయతీ కార్యదర్శి చంద్రహాస్, టీ ఏలు , ఇతర గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయం ఆహార ఉత్పత్తులపై సమావేశం



ప్రజాపక్షం /నిజాంపేట్ : నిజాంపేట్ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్లో మహిళా రైతులకు ఐకెపి మహిళా బృందాల కు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)సౌజన్యంతో పెరటి తోటల పెంపకం లో అవలంబించవలసిన మెలకువలు ,అలాగే సేంద్రియ వ్యవసాయం యొక్క లాభాలు , ఆహార ఉత్పత్తుల యొక్క మార్కెటింగ్ గురించి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే కాలానుగుణంగా మార్కెటింగ్ వ్యవస్థలోని మెలకువలను అలవర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని సమావేశంలో వివరించడం జరిగింది. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పథకాలను సక్రమంగా వినియోగించుకుని మహిళా రైతులు కూడా ఆర్థికంగా ఎదగాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజాంపేట ఏవో సోమలింగారెడ్డి, ఐకెపి ఏపిఎం అశోక్ రామాయంపేట ఏవో ప్రవీణ్ కుమార్, ఏఈఓ శ్రీలత, ఐకెపి సిసిలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# భూ సర్వే పరిశీలించిన ఆర్‌డిఓ చంద్రకళ

## మరో 50 మంది రైతులకు నోటీసులు జారి



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మర్కూక్ మండలం ఎర్రవల్లిలో వివాదస్పదంగా మారిన సర్వే నంబర్ 325లో మంగళ వారం కమతాల వారిగా నిర్వహించిన క్షేత్ర స్థాయి సర్వేను గజ్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రకళ, స్థానిక తహసీల్దార్ సరితతో పాటు కలిసి సర్వేను పరిశీలించారు. పోజిషనల్ ఉన్న రైతుల భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని సర్వే సిబ్బందికి ఆమె సూచించారు. అలాగే సర్వే చేసిన ప్రతి రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. మంగళవారం మళ్లి 50 మంది రైతులకు నోటీసులు జారి చేసి వారు సాగు చేసిన పోలాల వద్ద భూ ఆధారిత పత్రాలతో ఉండాలని రైతులకు సూచించారు. 80 ఎకరాలలో సర్వేను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కాగా గతంలో 325 సర్వే నంబర్‌లో అసైన్డ్ పట్టాలు పొందిన రైతులు తమ అవసరాల నిమిత్తం ఇతరులకు విక్రయించి తెల్లకాగితాల మీద బయానామా వ్రాయించుకున్నప్పటికీ, విక్రయదారుల పేరున భూమి బదాలింపు జరుగాక వారి పేరునే పాత రికార్డుల్లో చూచించడంతో వారికే అధికారులు నోటీసులు జారి చేయడంతో వారు తమ ఆధీనంలోనే భూమి ఉన్నట్లుగా నోటీసులు చూపించి హద్దులు పెట్టుకోవడంతో , ఆందోళనకు గురైన భూమిని కొనుగోలు చేసిన కొందరు రైతులు సర్వే అధికారులతో తమ గోడును విన్నవించుకోవడంతో భూ సర్వే అధికారులకు ఋటిలంగా మారుతుంది. సర్వేకు వచ్చిన అధికారులకు ముందు తాము కొనుగోలు చేసినట్లుగా సర్వే అధికారుల ముందు రైతులు తమ గోడు వినిపించుకోవడం కన్పించింది.

# డిప్యూటేషన్ ఆపండి.. ధూల్మిట్ట విద్యార్థులను కాపాడండి!

## డిప్యూటేషన్‌ను విరమించాలి.. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి

ప్రజాపక్షం/ సిద్దిపేట/మద్దూరు/ధూల్మిట్ట: ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న గణితం, సాంఘిక శాస్త్రం, మరియు సైన్స్ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌ను ధూల్మిట్ట జడ్పీ హెచ్ఎస్ అమ్మ ఆదర్శ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరారు. గతంలో పాఠశాలలో పూర్తి స్థాయి ఉపాధ్యాయ సిబ్బంది లేకపోవడంతో విద్యా వాలంటీర్లు, తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారంతో విద్యాబోధన కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొన్నదని వారు తెలిపారు. ప్రస్తుతం సమర్థవంతమైన ఉపాధ్యాయ బృందం ఏర్పడి విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా సంబంధిత ముగ్గురు ఉపాధ్యాయులు ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో సీట్లు సాధించేందుకు, పదో తరగతి విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించేందుకు విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలోనూ ఎన్ఎంఎంఎస్ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ విద్యా సంవత్సరం మధ్యలో విద్యార్థులకు అలవాటైన ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపిస్తే వారి చదువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య మంచి సమన్వయం ఏర్పడిందని, ఈ సమయంలో ఉపాధ్యాయుల మార్పు విద్యార్థుల విద్యా ప్రగతికి ఆటంకంగా మారుతుందని తెలిపారు. పునఃపరిశీలించి, ప్రస్తుత ఉపాధ్యాయ బృందాన్ని కొనసాగించాలని డీఈఓ కు అమ్మ ఆదర్శ కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సవినయంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ కో ఆప్షన్ సభ్యులు కొండూరు సతీష్ కుమార్, గ్రామస్తులు ధూల్మిట్ట మండలం బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు బామండ్లపల్లి కృష్ణయ్య, ధూల్మిట్ట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అనిల్ తదితరులు ఉన్నారు.

# ముందస్తు గుర్తింపుతో గుండె వ్యాధులను నియంత్రించవచ్చు



ప్రజాపక్షం/ సిద్దిపేట : ప్రస్తుత కాలంలో అనేక మంది గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించడం ద్వారా గుండె సమస్యలను నియంత్రించవచ్చని సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు గురురాజ్ ప్రమోద్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పలు రకాల గుండె జబ్బులకు శస్త్రచికిత్స అవసరం లేకుండానే ట్రావి విధానం ద్వారా చికిత్స అందించే అవకాశం ఉందన్నారు. సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాధులకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.అంజియోగ్రామ్, స్టెంటింగ్,u వాల్వ్ రీప్లేస్‌మెంట్, బైపాస్ సర్జరీ వంటి చికిత్సల్లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. సిద్దిపేట ప్రాంత ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని రవి నర్సింగ్ హోమ్‌లో ప్రతి మంగళవారం వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని గురురాజ్ ప్రమోద్ కోరారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది శ్రీధర్ రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# పార్క్ నిర్మాణ పనులకు సర్పంచ్ స్రవంతి శంకుస్థాపన



ప్రజాపక్షం/సిద్ది–పేటఅర్బన్:సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లి గ్రామంలో చెరువు కట్ట పక్కన పార్క్ నిర్మాణ పనులను మంగళ వారం గ్రామ సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం,ఆరోగ్యకరమైన జీవనానికి ఉపయోగపడేలా పార్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింగారావు,ఎఈ సామ్య,నాయకులు అల్లం ఎల్లం,ప్రశాంత్‌గౌడ్,కట్కూరి సత్యనారాయణ,ఉపసర్పంచ్,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరబోయే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ ద్వారా అడ్మిషన్ పొందాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జీవన్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం బిఎ 20, బికాం 36 ,బిఎస్‌సి బిజెడ్‌సి 10,ఎంపిసి 06 సీట్లు ఉన్నాయని అడ్మిషన్ పొందాలనుకొరే విద్యార్థులు ఈనెల 24 మరియు 25వ తేదీలలో ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించి సీటు పొందాలని , ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,ఏవైనా సందేహాలు ఉంటే కళాశాలలోని దోస్తు కోఆర్డినేటర్ కిషోర్ చేత నివృత్తి చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు.

# మట్టి గణపతికి ప్రత్యేక పూజలు

## 38 వేలకు గణేష్ లడ్డూ ప్రసాదం దక్కించుకున్న నాగప్పగారి సుమన్

ప్రజాపక్షం/రేగోడ్: మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలో నోబెల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. 38 వేలకు గణేష్ లడ్డూ ప్రసాదం దక్కించుకున్న నాగప్పగారి సుమన్ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ పూజారి విట్టల్ రావు మహారాజ్ చేతుల మీదుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ పోచయ్య ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు హాజరయ్యారు. గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# బందెల బాబును పరామర్శించిన తిరుపతిరెడ్డి



ప్రజాపక్షం / మెదక్ : మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామ వార్డు సభ్యుడు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బందెల బాబు ఇటీవల అనారోగ్యానికి గురై ఆర్‌విఎం ఆస్పత్రిలో చికిత్స పొందారు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బూరుగుపల్లి గ్రామానికి చేరుకుని బాబును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కిసరెడ్డి మాణిక్య రెడ్డి, మాజీ సర్పంచ్ చెన్న గౌడ్, సర్పంచ్ లింక రాజు, వార్డు సభ్యుడు ఉప్పరి ప్రవీణ్, నాయకులు మెంగోరబోయిన సాయి, బాబా, అభిన్ లక్ష్మణ్, కుమ్మరి విఠల్, రాములు, శివయ్య, చంద్రబాబు, సాయిలు, రాజయ్య, రవి తదితరులు ఉన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జన వేడుకలు నిర్వహణ

## రవాణశాఖ మంత్రి పొన్నం

ప్రజాపక్షం / హుస్నాబాద్: బుధవారం హుస్నాబాద్ లో జరగనున్న గణేశ్ నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలని తెలంగాణ బి సి రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు ప్రజలను కొరారు. మంగళవారం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లును మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. భద్రత లైటింగ్ ట్రాఫిక్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిమజ్జన ప్రదేశంలో రక్షణ సిబ్బందిని ఈత గాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ప్రజలను కోరారు. నిమజ్జన ప్రదేశంలో లైటింగ్ ఏర్పట్లు, ట్రాఫిక్‌నియంత్రణ పారిశుద్యం , త్రాగునీటి వసతి వంటి సౌకర్యాలను అందుబాటులో పెట్టాలని అధికారులను కోరారు. రాత్రి వేళల్లో నిమజ్జన ఏర్పట్లకు రక్షణ కల్పించాలని పట్టణంలో ఏలాంటి అల్లర్లు జరగకుండ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎల్లమ్మచెరువు కట్ట సుందరికరణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్మెన్ చిత్తారి పద్మరవిందర్, మాజీ ఎంపిపి ఆకుల వెంకన్న, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మెన్ సర్పంచు చిటుమల్ల రవిందర్, ఆకవరం మఠం భవాణిశివప్రసాద్ కౌన్సిలర్లు , మార్కెట్ కమీటి డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



**ప్రజాఫక్షం/ కొండాపూర్ :** కల్లు గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్ష ణమే పరిష్కరించాలని కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ జంగన్న గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రాల్లో నీరా అమ్మకాలకు అవ కాశం కల్పించాలని కల్లు గీత కార్మికు లకు మోపెడ బైక్‌లు అందిందించాలని కోరారు. కల్లు దుకాణాల నిర్మాణం కోసం ప్రతి గీత కార్మికుడికి రూ. 5 లక్షల సబ్సిడి రుణాలు,మంజూరు చేయాలని ఈతచెట్లు పెంపకానికి ప్రతి సోసై టీకి ఐదు ఎకరాలు ప్రభుత్వ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుని వారి జోవనోపాదికి భరోసా కల్పించాలని కల్లుగీత కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

## మండపాల్లో మాజీ కార్పొరేటర్ సింధుఆదర్స్‌రెడ్డి పూజలు



**ప్రజాఫక్షం/ రాంచంద్రాపురం :** భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్స్‌రెడ్డి మంగళవారం వివిధ గణేష్ మంపా లను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా భార త్‌నగర్ డివిజన్‌లోని ఏల్‌ఐజి కాలనీలో నరేందర్ రెడ్డి, ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు నిర్వ హించారు. అనంతరం రామచంద్రాపురంలో మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య, ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ ఎస్ సీని యర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ కో ఆర్డినేటర్, చిన్నా తదితరులు పాల్గొన్నారు. భక్తులు స్థానిక నాయ కులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షులను కలిసిన రేగోడు కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/రేగోడు:** సంగా రెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షు లుగా నియమితులైన చంద్ర శేఖర్ రెడ్డిని ఆయన నివాసం నారాయణఖేడ్ లో మంగళ వారం రేగోడు మండల కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మాన చేశారు ఈ కార్యక్ర మంలో రేగోడు మాజీ పిఎస్ చైర్మన్ శ్యామ్ రావు పిఎస్సిఎస్ వైస్ చైర్మన్ రాధా కిషన్ మండల నాయకులు రామా గౌడ్ నారాయణ శంకరప్ప దత్తు పరశురాం తదితరులు ఉన్నారు

## బస్టాండ్ లేక ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



**ప్రజాఫక్షం/ చౌట- కూర్:** చౌటకూర్ మండలం కేంద్రమైన సింగూరు ఎక్స్ రోడ్డు వద్ద బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో ప్రయ ణికులు రోడ్డు ప్రక్కనే బస్సులకోసం వేచి చూడాల్సిన వస్తుంది. ఎండ ,వర్షం , సమ యంలో వృద్ధులు ,మహిళలు, చిన్నారులు ,తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. అలాగే సెలవు రోజుల్లో పర్యాటకులు ,సింగూరు ప్రాజెక్టు చూడటానికి చాల మంది వస్తుంటారు. బస్సులు అగే సమ యంలో ట్రాపిక్ కు కూడా అంతరాయం కలుగుతుంది. సంబం దిత అధికారులు స్పందించి ప్రయాణికులకు సౌకర్యవంతమైన బస్టాండ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## పటాన్‌చెరులో ఘనంగా గురుపూజోత్సవం



**ప్రజాఫక్షం/ పటాన్‌చెరు :** గత 25 ఏళ్లు నిరంతరం గురుపుజోత్సవాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కి అభినందనలు తెలిపారు. అదనపు కలెక్టర్ పాండు పటాన్చెరులో నియోజకవర్గ స్థాయిలో జీఎంఆర్ ఆద్వర్యంలో ఎజ్యుకేషనల హబ్‌గా అభివృ ద్ధికి ప్రాదాన్య జిల్లా అదనపు కలక్టర్లు పాండు ఉపాద్యా యులు నవ సమాజ నిర్మాతలు,బావి బారత పౌరుల తయారీ బాధ్యత పై జిల్లా విద్యాశాఖ అధికార రోహిణి ప్రభుత్వ విద్యాసంస్థలకు నాణ్యమైన విద్య అందిస్తూ బలోపేతం చేయడం ప్రాధ్యానం, మత్తు పదార్థాల ప్రమాదంపై ఉపాద్యాయులు విద్యార్తులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే పటాన్చెరు ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య అభివృద్ధి పనులు మౌళిక సదుపాయాల పునరుద్ధరణలు చేపటబడుతున్నాయని విద్యార్తుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా పాదాభినందనలు కార్యక్రమానిక రూ. 26.000 నగదు. బహుమతి రూపంలోను ఈ కార్యక్రమంలో మాజీ ప్రతినిధులు వివిధ శాఖల అదికారులు ఉపాద్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ రష్మి పెరుమాల్

**ప్రజాపక్షం / హుస్నాబాద్:** హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై గణేశ్ నిమజ్జన పాయింట్ ఏర్పాట్లను మంగళ వారం సిద్దిపేట జిల్లా సీ పీ రష్మిపెరుమాల్ పరిశీలిం చారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం నిమజ్జన కార్య క్రమం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లను ఆధికారులు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 3వేల పైగా విగ్రహాలు ఉన్నందున హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట పై బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించుటకు సీ పీ వచ్చారు. సీ పీ మాట్లాడుతూ నిమజ్జన సందర్భంగా పిల ల్లను నిమజ్జన సమయంలో వాహణం వెంట తీసుకురా వద్ద ప్రజలను కోరారు. తాగి డిజేలతో ఊరేగింపులను నిసేదిస్తున్నట్లు ప్రతి ఒక్కరు శాంతి భద్రతలతో కార్యక్ర మాలను విజయవంతం చేయాలని కోరారు. నిమజ్జన ప్రదేశంలో లైటింగ్ ఏర్పాట్లు తగినంత సిబ్బందిని నియ మించాలని కమీషనర్‌ను సూచించారు. ఊరేగింపు సమ యంలో వాహనాల రద్దీవల్ల రోడ్లపై ఇతర వాహనాలకు ఇబ్బంది రాకుండ ట్రాఫిక్ ఏర్పాట్లను పోలీస్ సిబ్బంది చూసుకోవాలని కోరారు. షోషల్ మిడియాలో ఏలాంటి వదంతుల రెచ్చగొట్టె వ్యాఖ్యలు ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్థించడం లాంటివి చేయరాదని ఆలాంటి వారిపై కఠినగా వ్యవహరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమీషనర్ మల్లికార్జున్, ఏ సీ పి సదా నందం, సీ ఐ శ్రీధర్‌గౌడు , ఎస్ ఐ లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గోన్నారు.

## ముప్పిరెడ్డిపల్లిలో వీధి కుక్కల స్వైరవిహారం



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మండలం లోని ముప్పి రెడ్డిపల్లి గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. గ్రామంలోని పలు వీధుల్లో కుక్కలు గుంపు లుగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని పేర్కొన్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఒక్కసారిగా ప్రజల వెంటపడుతుండటంతో స్థానికులు భయాందోళ నకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు చెబు తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వీధుల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్ర మత్తంగా తిరగాల్సి వస్తోందని తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు ఇళ్ల పరిసరాల్లో కూడా కుక్కలు తిరుగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతు న్నాయని పేర్కొన్నారు. కుక్కల సంఖ్యను నియంత్రిం చేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించేందుకు అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కుక్కల సంచారాన్ని నియంత్రించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకుని గ్రామస్తులకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు గ్రామంలో పరి స్థితిని పరిశీలించి తగిన చర్యలు చేపడితే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కమలాపురం చెరువు వద్ద భద్రత ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాఫక్షం/ సంగారెడ్డి :** నారాయణ ఖేడ్ మానూర్ ,నాగలిగిద్ద మండాలకు సంబందించిన వినాయక నిమ జ్జనాలు జరగనున్న కమలాపురం చెరువును జిల్లా ఎస్పీ పరతోష్ ఫంకజ్ సందర్శించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్బంగా వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. 9,11 రోజులలో అదిక సంఖ్యలో వినా యక విగ్రహాలు నిమజ్జనం కానున్న నేపథ్యంలో భక్తు లకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన లైటింగ్ క్రేన్లు గజ ఈతగాళ్లను ముందుగానే అందుబా టులో ఉంచాలని సూచించారు. గణేష్ శోభాయాత్రలు జరిగే మార్గాల్లో రోడ్ల పరిస్థితి అవసరమైన మరమ్మ తులు చెరువు వద్ద బారికేడింగ్ భద్రతా లైటింగ్ పారి శుద్ధ్య ఏర్పాట్లు తదతర అంశాలపై సంబందిత అధికా రులతో చర్చించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులు ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అవసర మైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## విద్యాసంస్థల అధినేత తాళ్ల మల్లేశం కుటుంబ సభ్యులకు పరామర్శ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** తాళ్ల పద్మావతి లర్నర్స్ ల్యాండ్ విద్యా సంస్థల అధినేత తాళ్ల మల్లేశం ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్, మాజీ ఎంఎల్‌ఏ వన్నాల శ్రీరాములు, మాజీ జడ్పిటిసి చైర్మన్ సాంబారి సమ్మారావులు మంగళవారం సంద ర్శించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీర వెంట బిసిఐఎఫ్ ప్రణాళిక అడ్వైజర్ డాక్టర్ కొణతం కృష్ణ, బిసిఐఎఫ్ వరంగల్ బాధ్యులు ధర్మపురి రాజగో విందు, పెద్దూరి పెద్దన్న, సదానంద వేముల, తాళ్ల మల్లేశం వియంకులు, మిత్రుడు కూచన భాస్కర్ తదిత రులు మల్లేశం చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. మల్లేశం విద్యాసం స్థల ద్వారా ఎన్నో వేల మంది విద్యార్థిని, విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారని విలువలతో కూడిన విద్యను అందించాలని కొనియాడారు.

## ఐబి వినాయక మండపాన్ని సందర్శించిన జగ్గారెడ్డి



**ప్రజాఫక్షం/ సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణంలోని ఐబి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని టీపీసీసీ వర్కింగ్ జగ్గారెడ్డి, సందర్శించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబందించిన ఏర్పాట్లపై నిర్వాహకులు స్థానిక నాయకులతో చర్చించారు. నిమజ్జనం సంద ర్భంగా ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవస రమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో భక్తి శ్రద్ద లతో నిర్వహించేందుకు అదికారులు నిర్వాహ కులు సమన్వయంతో పనిచేయాలని జగ్గారెడ్డి సూచించారు.

## అసైన్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి

**ప్రజాపక్షం/జనగామ:** తెలంగాణ రాష్ట్రంలో పేదలు, దళితులు, అణగారిన వర్గాలకు ప్రభుత్వం కెటాయించిన అసైన్డ్ హూముల పరి స్థితిపై రాష్ట ప్రభుత్వం వెంటనే సమగ్ర శ్వేత పత్రం విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట ప్రధాన కార్యదర్శి మారు పాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. డీహెచ్‌పీ ఎస్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం స్థానిక సీపీఐ కార్యాలయంలో పైసా రాములు అద్యక్ష తన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్ కుమార్ మాట్లాడుతూ భూమి లేని పేదలకు భూమి పంపిణిచేయడం సామాజిక న్యాయంలో కీలకమైన అంశమని, దశాబ్దాలుగా ప్రభుత్వాలు భూములు కెటాయించినప్పటికి అనేక మంది అసైన్డ్ భూముల లబ్దిదారులు ఇప్ప టికీపూర్తిస్థాయి హక్కులు, భద్రత లేకుండా జీవి స్తున్నారన్నారు. భూమి కోల్పోయిన అసలు లబ్ది దారులకు ప్రత్యామ్నాయ భూమి లేదా న్యాయబ ద్ధమైన పరిహారం కల్పించాలని కోరారు.

## బేస్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించాలి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** బేస్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడల్లో క్రీడాకారులు జాతీయస్థా యిలో రాణించాలని ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రటరి వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బేస్‌బాల్, బాస్కెట్‌బాల్ సెలక్షన్స్ మంగళవారం మహబూ బాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహబూ బాబాద్ జిల్లా క్రీడలకు పుట్టినిల్లని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల వల్ల మానసికోల్లాసంతోపాటు పలువురు క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగు పడతాయని అన్నారు. వీటిలో ఎంపికైన క్రీడాకా రులు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరి కల్లూరి ప్రభాకర్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరి సమ్మెట ప్రేమ్ కుమార్, నాగిరెడ్డి, అవారి శ్రీనివాస్, మహంకాళి వెంకటేశ్వర్లు, కొమ్ము రాజేందర్, చాంప్లానా యక్, ఇమాంపాషా, సునీల్, ప్రణయ్, పుష్ప లీల,నిర్మల, రాజకుమారి, బాస్కెట్‌బాల్ సెల క్షన్స్ కన్వీనర్ పిల్లి కాశీనాథ్, కమల్‌కిషోర్, సునీత, ప్రవీణ్, కోచ్ వెలిశాల కుమారస్వామి, ఎంబిఏ అధ్యక్షులు మొగిలి ప్రసాద్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.